ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

5

శనివారం 20 సెప్టెంబరు 2025

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ అన్నారు. కరీంనగర్ బ్యాంకు కాలనీలోని దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన ద్వారా శిక్షణ పొందుతున్న యువతకు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 విభాగం ప్రతినిధులు శుక్రవారం పలు విషయాలపైఅవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఆవుల సంపత్ యాదవ్ మాట్లాడుతూ చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 సదుపాయాలు, పోక్సో చట్టం -2012, బాల్య వివాహ నిరోధక చట్టం -2006 గురించి అవగహన కల్పించారు.

సాగుకు లేదు బెంగ

- నిండుకుండల్లా ప్రాజెక్టులు
- దిగువకు భారీగా నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణ జిల్లాలకు గోదావరి నది వరప్రదాయినిగా మారింది. జీవధారగా నిత్యం ప్రవహించకున్నా వర్షాకాలంలో నదికి వచ్చే వరదే ఉత్తర తెలంగాణ ప్రజలకు సాగు, తాగునీరందించి బతుకుబాటను చూపుతోంది. శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, దిగువ మానేరు డ్యామ్‌లు 150 టీఎంసీల నీటి నిలువ సామ ర్థ్యంతో సుమారు 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తూ ఈ జిల్లాలను తెలంగాణ ధాన్యాగారంగా మార్చు తున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాల కా రణంగా గోదావరి నదికి వచ్చిన వరద 500 టీఎంసీలకు పైగా ఉండగా ఆయా డ్యామ్‌లలో 150 టీఎంసీల నీటిని ఒడిసిపట్టుకున్నాము. మిగతా వరద దిగువకు వెళ్లిపోయింది.



మానేరు డ్యాం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఎల్ఎండీ, మిడ్ మానేరుకు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే జూన్ నుంచి సెప్టెంబరు 18 వరకు గోదావరి నదికి ఎస్సారెస్పీలోకి 454.1 టీఎంసీల వరద ప్రవాహం వచ్చిందని అధికారులు లెక్కేశారు. ఈ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 45.82 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు వదలారు. 27 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం ఉన్న మిడ్ మానేరు నిండిన తర్వాత దిగువ మానేరు డ్యామ్‌కు గేట్లు తెరచి నీటిని వదలారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీలోని 9, 10 ద్వారా అనంతసాగర్, రంగనాయక్‌సాగర్‌కు కూడా నీటి విడుదల కొనసాగుతున్నది.

కాకతీయ కాలువ ద్వారా ఆయకట్టుకు..

కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాల ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తిగా నిండి 24 టీఎంసీల నీటిని నిలువ చేసుకున్నది. ఎస్సారెస్పీ గేట్లు తెరచి 332 టీఎంసీల నీటిని కిందికి వదిలారు. ఈ వరదతోపాటు ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టు నిండి దాని గేట్ల ద్వారా భారీ ఎత్తున వరద గోదావరిలో కలిసింది. ఈ వరద ప్రవాహమంతా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు మంథని, కాళేశ్వరం మీదుగా ప్రవహించింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 20.17 టీఎంసీల (మిగతా 8వ పేజీలో)



3,43,240 ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,43,240 ఎకరాలలో వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా 2,76,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. శ్రీరాంసాగర్, ఇటు ఎల్ఎండి డ్యామ్‌లు నిండి ఉండడంతో ఈ జిల్లా సాగుకు ఖరీఫ్‌కు ఢోకా లేకుండా పోయింది. ఖరీఫ్‌కే కాకుండా రబీ సీజన్‌కు కూడా సాగునీరుకు సమస్యలేని పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. దీంతో జిల్లా రైతులు కాలం కలిసి రావడంతో పూర్తిగా సంతోషంగా ఉన్నారు.

జీపీ సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న డీపీఓ జగదీష్

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బంది మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జగదీష్ సూచించారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం 14 గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు చామన పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి డీపీఓ హాజరయ్యారు. అనంతరం వర్క ర్లకు దుస్తులు, పిపి కిట్లు పంపిణీ చేసి సన్మానం చేశారు. పారిశుధ కార్మికులు పీపీ కిట్లు ధరించి పని చేయాలన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో బాగంగా ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చామనపల్లి గ్రామ పంచాయతీ వద్ద కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, యునిసెఫ్ జిల్లా కో ఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎస్‌బీఎం జిల్లా కో ఆర్డినేటర్ రమేష్, వేణు, హెల్త్ ఆఫీసర్ మనోహర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేపట్టాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక ప్రకారం ఓటరు జాబితాపై స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఆయన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ నిర్వహణకు ముందు ప్రతి పోలింగ్ బూత్‌స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 డేటాతో సరి చూసుకోవాలన్నారు. ఈ రెండు జాబితాల్లో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరించాల్సి ఉంటుందని చెప్పారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్‌స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్‌వో, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్‌వో సూపర్ వైజర్లతో రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు లక్ష్యాలను నిర్దేశించుకొని ఎస్ఐఆర్ చేపట్టేలా కార్యాచరణ తయారు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లో లెవల్ వంతెన

- అర్కండ్ల వాగు బ్రిడ్జిపై వరద నీరు
- నాచుపట్టి జారిపడుతున్న వాహనదారులు

7

త్వరలో కాంగ్రెస్ కమిటీలు



- మంత్రుల పరిశీలనలో పేర్లు
- జాబితాలు సమర్పించిన డీసీసీ, కాంగ్రెస్ నగర అధ్యక్షులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర శాఖల అధ్యక్షులను అలాగే కొనసాగిస్తూ మిగతా పోస్టులు కొత్తవారితో భర్తీ చేయాలని నిర్ణ యించింది. కొత్త కమిటీల రూప కల్పనతో జిల్లాలో పార్టీకి కొత్త జవ సత్వాలు నింపాలని భావిస్తోంది. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమా లను క్షేత్ర స్థాయికి తీసుకు వెళ్లి ప్రజల్లో పార్టీకి పట్టు పెంచాలని అనుకుంటున్నది. త్వరలో స్థానిక సం స్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త కమిటీలు వేసి గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ నాయ కత్వాన్ని పటిష్టం చేయాలని, వారి ద్వారా ప్రజల్లోకి వెళ్లి సానుకూల ఫలితాలను రాబట్టుకోవాలని వ్యూహం రూపొంది స్తున్నది.

అధిష్ఠానానికి, మంత్రులకు ప్రతిపాదనలు

పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఈ నెల 15న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి జిల్లా, నగర కమిటీలలోని వివిధ పోస్టులకు పేర్లను ప్రతిపాదించారని సమాచారం. వీరు సమ ర్పించిన జాబితాలను పరిశీలించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ముగ్గురు మంత్రులకు కూడా ఈ జాబితాలను అందజేయాలని, వారి సూచ నలను కూడా పరిగణలోకి తీసుకున్న తర్వాత కమిటీలు ప్రకటిస్తామని చెప్పారని తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడి సూచన మేరకు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు డీసీసీ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వారివారి ప్రతిపాదనల కాపీలను అందజేశారు. మంత్రుల పరిశీలన తర్వాత వారి సూచనలు తీసుకొని రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్ జిల్లా కమిటీని, మండల, డివిజన్ అధ్యక్షులను ప్రకటించనున్నారని సమాచారం.

స్థానిక నోటిఫికేషన్‌కు ముందే..

జిల్లా, నగర కమిటీలో అధ్యక్షులు పాత వారే కొనసాగుతుండగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యవర్గసభ్యుల పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లా కమిటీకి అనుబంధంగా మండల కమిటీలు ఏర్పాటుచేయడానికి వీలుగా మండల శాఖ అధ్యక్షులను, నగరంలో వివిధ డివిజన్లకు అధ్యక్షులను ప్రకటించనున్నారు. కొత్త కమిటీలు ఏర్పడిన తర్వాత వీరి నేతృత్వంలో పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసి కమిటీలను ప్రకటిస్తారని తెలిసింది.

అభివృద్ధి పనుల టెండర్లు పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అగ్రిమెంట్లు, టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజ నీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అగ్రిమెంట్లను పూర్తి చేసి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అసంపూర్తి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, సంజీవ్‌కుమార్, డీఈలు లచ్చిరెడ్డి, ఓం ప్రకాష్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, ఏఈలు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి

తడి, పొడి చెత్తపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తడిపొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నివారణ, హోం కంపోస్టింగ్ తయారు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో డివిజన్‌లోని కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అంగారిక'ను అభివృద్ధి చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగారిక టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలని టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్ల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘుశంకర్‌రెడ్డి మాట్లా డుతూ మూడు సంవత్సరాల క్రితం ఆనాటి బీఆర్ఎస్ పాలనలో తిమ్మా పూర్ మండలం రామకృష్ణపూర్ కాలనీలోని రాజీవ్‌స్వగృహకు కేటాయించిన స్థలంలో 824 ప్లాట్లను ఏర్పాటు చేసి అంగారికటౌన్‌షిప్ పేరుతో ఆనాటి కలెక్టర్ బహిరంగ వేలంలో విక్రయించారని చెప్పారు. ప్రభుత్వానికి 147 కోట్లరూపాయల ఆదాయం సమ కూరగా, రిజిస్ట్రేషన్ల ద్వారా మరో దాదాపు 12 కోట్ల రూపాయలు సమకూరిందని అన్నారు. ప్లాట్ల విక్రయంతో వచ్చిన ఆదాయంతో టౌన్‌షిప్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అప్పటి కలెక్టర్, ఆర్డీవో ప్రకటించారన్నారు. ప్లాట్లను విక్రయించి మూడేళ్లవుతున్నా ఎటు వంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కలిసినా స్పందిం చడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. లేనిపక్షంలో దశలవారి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చంద సత్య నారాయణ, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మారెపల్లి మల్లారెడ్డి, ఓరుగంటి నర్సింహారెడ్డి, తోట మోహన్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు, సుడా చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.



సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్ల సంఘం ప్రతినిధులు

అంగారికా టౌన్‌షిప్ అభివృద్ధికి సహకరిస్తా

- 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

రామకృష్ణ కాలనీలో గత ప్రభుత్వం ప్లాట్లను విక్రయించిన ఏర్పాటు చేసిన అంగారిక టౌన్‌షిప్ అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం సుడా కార్యాలయంలో అంగారికా టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చైర్మన్ నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజే శారు. సుడా నిధులతోనైనా టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంగారికా టౌన్‌షిప్ ప్లాట్ల వేలంతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి దాదాపు 150 కోట్లు వచ్చాయని, ఆనాటి ప్రభుత్వం వాటిని వాడుకుందన్నారు. ఇప్ప టికే రెండు కోట్లతో టౌన్‌షిప్‌లో అంతర్గత రోడ్లను ఫార్మేషన్ చేసి వరద నీరు వెళ్ళే విధంగా పైపులు వేయించానన్నారు. మరో 20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. మిగిలిన 32 ప్లాట్లను విక్రయించి వచ్చిన ఆదాయంతోనైనా అభివృద్ధి చేయడం కోసం కలెక్టర్ ద్వారా గృహ నిర్మాణశాఖ అనుమతి కోరామన్నారు. త్వర లోనే అనుమతి తీసుకొని అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

సైబర్ నేరాల నియంత్రణకు వారియర్లు

- పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్లలో సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ వారియర్లను నియమించినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సైబర్ వారియర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరాల నియం త్ర ణలో సైబర్ వారియర్లదే కీలక పాత్ర, కీలక బాధ్యతని అన్నారు. సైబర్ నేరానికి గురైతే బాధి తులు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చే యాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా 8712665866 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం సైబర్ వారియర్లకు ప్రత్యేక టీ-షర్టులను కమిషనర్ అంద జేశారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడానికి అవసరమైన శిక్షణ కూడా వారికి ఇచ్చామని తెలిపారు. సమావేశంలో సైబర్ క్రైం డీఎస్పీ కోత్వాల్ రమేష్, సీఐ సునీల్ కుమార్,సీఐ సరిలాల్,ఎస్ఐజోత్స్న పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి

నేరస్థులకు శిక్ష పడేలా సమన్వయంతో కృషి చేయాలని పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం అన్నారు. జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ సమన్వయ సమావేశాన్ని శుక్రవారం సీపీ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ నూతన చట్టాలకనుగుణంగానే రాలకు శిక్షలు పడేలా సాంకేతికతను విని యోగించుకోవాలని సూచించారు. ఈ నెల 13న జరిగిన లోక్ అదాలత్‌లో 3,130 కేసులను పరిష్కరించినందుకు అధికారులను, సిబ్బందిని పో లీస్ కమిషనర్ అభినందించారు. సమావేశంలోఅడిషనల్ డీసీపీ వెంకట రమణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డి శరత్, అడిషనల్ పీపీ, పీపీలు జి లక్ష్మణ్, రంజిత్ కుమార్, వీరాస్వామి, ఏసీపీ శ్రీనివాస్‌జి, సీఐ తిరుమల్ పాల్గొన్నారు.



సైబర్ వారియర్లకు టీ షర్ట్‌లు అందజేస్తున్న సీపీ గౌస్ ఆలం

పోక్సో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మంచికట్ల రాజేశం



మంచికట్ల రాజేశం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు-2 స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది మంచికట్ల రాజేశంను నియమిస్తూ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ హైదరాబాద్ నుంచి నియామక ఉత్తర్వులు రాజేశం అందుకున్నారు. రాజేశం బాలబాలికలపై లైంగిక వేదింపులకు సంబంధించిన కేసులలో పోలీసుల పక్షాన వాదిస్తారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజేశం నియమకంపై కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య, జిల్లా కన్వీనర్ కొత్తకొండ శంకర్, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ బొడ్డు రాజు, హైకోర్టు న్యాయవాది మంచికట్ల విష్ణువర్ధన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అరెల్లి రాములు, పంజాల కుమారస్వామి, జూలూరి శ్రీరాములు, గడ్డం లక్ష్మణ్, గౌరు రాజిరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు రాచకొండ ప్రభాకర్, బత్తిని తిరుపతి గౌడ్, ఐతు సృజన్, లింగంపల్లి శ్రీకాంత్, నవాజ్ అభినందనలు తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న వాహనాల పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గన్నేరువరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పికప్ వాహనం ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్‌చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటజిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మిరుదొడ్డి శివకుమార్ పికప్ వాహనంలో గురువారం రాత్రి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా గన్నేరువరం పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నారన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం పికప్‌వాహనానికి మరోకారుతో ఎస్కార్ట్‌చేస్తూ పోలీసుల సమాచారాన్ని తెలుసుకుంటూ పికప్‌వాహనం డ్రైవర్‌కి సమాచారం ఇస్తున్న బెజ్జంకి గ్రామానికి చెందిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని కారును సీజ్‌చేసి రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని శుక్రవారం ఉదయం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. నల్లగొండ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడ్ చేసి ఇతర ప్రాంతానికి తీసుకెళ్లే క్రమంలో లారీని పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు ఇసుకను లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ని పట్టుకొని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ కొండపల్కల నరేష్, లారీ యజమాని మామిడి నరేందర్‌రెడ్డి, ఎక్స్‌కవేటర్ నిర్వాహకుడు కనకం మహేష్ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పెండం జంపన్నపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మూడు రోజుల కిందట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన గొల్లపల్లికి చెందిన దర్శనాల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన..

● సంవత్సరం జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధికిచెందిన బాలేమల్లేశ్ అనేవ్యక్తి ఓమహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో శుక్రవారం కోరుట్ల న్యాయమూర్తి పావని నిందితుడికి సంవత్సరం జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ కార్యాలయవర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. 2020సంవత్సరంలో అప్పటి కథలాపూర్ ఎస్ఐ రాజప్రమీళ నిందితుడిపై కేసునమోదు చేశారని తెలిపారు. సంబంధిత కేసులో చార్జిషీట్ దాఖలు చేయగా సాక్షులను విచారించిన కోర్టు నిందితుడు మల్లేశ్‌కు శిక్షను విధించింది.

బైక్‌పై నుంచి పడి జీపీవోకు గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో జీపీవో(గ్రామ పాలనాధికారి) చదువు విక్రమ్‌రెడ్డి గురువారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా పాము అడ్డుగా వచ్చింది. భయపడిన విక్రమ్‌రెడ్డి బైక్‌పై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన విక్రమ్‌రెడ్డి విధులు ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా పాము అడ్డు రాగా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బండి అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతని చేయి విరిగింది. కాగా స్థానికులు తోటి జీపీవోలకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని అతనిని జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని మందాడిపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఆర్టీసీ ఎలక్ట్రికల్‌బస్సు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. నిజామాబాద్ డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తోంది. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.


అర్కండ్ల లో లెవల్ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

ప్రమాదకరంగా లో లెవల్ వంతెన

- అర్కండ్ల వాగు బ్రిడ్జిపై వరద నీరు
- నాచుపట్టి జారిపడుతున్న వాహనదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్కండ్లలో లెవల్ వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలు కురిసినప్పుడు ఈ వంతెన దాటాలంటే ఒక సాహసమే చేయాలి. వరద ప్రవాహం ఉన్నప్పుడు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై లో లెవెల్ వంతెన ఉంది. వర్షా కాలంలో ఈ వంతెనపై నుంచి నెలల తరబడి నిరంతరం నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు ఈ వంతెనను దాటాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసి నప్పుడు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవ హించడంతో గ్రామస్తులు కొన్ని రోజులపాటు పొలాల వద్దకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

రోడ్డు నిర్మించారు.. వంతెనను వదిలేశారు..

వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండల కేంద్రం లోని ఎన్‌హెచ్-563 జాతీయ రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర 17 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించారు. ఈ వంతెనను వదిలేశారు. చిన్నపాటి వర్షం కురిసినా అర్కండ్ల వాగులో ప్రవాహం పెరిగి వంతెనపైకి చేరుతుంది. దీంతో ఈ రోడ్డు నిరుపయోగంగా మారుతుంది. వీణవంక మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు మీదుగా కేశవపట్నం వస్తుంటారు. వర్షాకాలం వస్తే రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో వంతెనపై నాచు పట్టి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి వాగు దాటుతూ ప్రవాహంలో పడి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. తర్వాత ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అర్కండ్ల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.6వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6వేలు పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆరు గురు రైతులు 23క్వింటాళ్ల విడిపత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల కొత్త పత్తిని గోనెసంచుల్లో విక్రయానికి తెచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.6వేలు, కనిష్ఠ ధర రూ.3800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి.

సెలూన్ షాప్ దగ్ధం

ఓదెల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సెలూన్ షాప్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన ముత్యాల సదయ్యకు చెందిన షాప్ మధ్యాహ్నం బంద్ చేసుకొని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి షాపులోని పరికరాలు, కుర్చీలు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు లక్ష రుపాయల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ముత్యాల సదయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరాడు.

భవిత కేంద్రానికి ఆటో సమకూర్చిన కలెక్టర్


భవిత కేంద్రానికి ఆటోలో వెళుతున్న దివ్యాంగ పిల్లలు

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ కాలనీలో గల భవిత కేంద్రానికి కలెక్టర్ పమేలా సత్పతి రెండు రూట్లలో రెండు ఆటోలను అందించారని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆటోలలో దివ్యాంగులైన పిల్లలను తరలించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. ఇందిరానగర్ నుంచి ఒకటి, అలుగునూర్ నుంచి మరొక ఆటో సౌకర్యం కల్పించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలోకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 52వాహనాలనుసీజ్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ నేరాలు నియంత్రించడమే పోలీసుల లక్ష్యమని, అందులో భాగంగానే కార్డెన్‌సర్చ్ చేపడుతున్నామన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సైబర్‌నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డుభద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం చోరీ నిందితుడి అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం సంగంపల్లి గ్రామంలో గురువారం నేరెళ్ల లచ్చవ్వ అనే వృద్ధురాలి మెడలో నుంచి తులంన్నర విలువ చేసే బంగారు కుతికట్టు తెంపుకొని ఎత్తుకెళ్లిన జగిత్యాలరూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికిచెందిన మన్నె గంగారాజం అనే నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బాధితురాలు నేరెళ్ల లచ్చవ్వకు ఆరోగ్యం బాగాలేనందున అతడి కుమారుడు లింగన్న సంగంపల్లి గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరులేని సమయాన్ని గమనించిన నిందితుడు మన్నె గంగారాజం ఇంట్లో వరండాలో పడుకొని ఉన్న లచ్చవ్వ దగ్గరికి వెళ్లి మెడలో నుంచి తులంనర బంగారు కుతికట్టు తెంపుకొని పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం పొలాస హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా మన్నె గంగారాం పారిపోతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి తులంనర బంగారు కుత్తికట్టు, ఓ మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడిని 24 గంటల్లోనే పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ సదాకర్‌తోపాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రమేష్(ఫైల్)

ఎలిగేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన రేండ్ల రమేష్(22) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. రమేష్ గతంలో ఆర్మీ, పోలీస్‌పరీక్షలను రాసి మెడికల్ టెస్ట్‌లో కంటిచూపు లోపంతో ఇంటర్వ్యూలకు సెలక్ట్ కాలేదు. దీంతో అతను మానసిక వేదనతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 16న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు రమేష్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారుకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కోనరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ధర్మారంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిముందు ఉన్నకారుకు నిప్పుపెట్టారు. ధర్మారం గ్రామానికి చెందిన లోకిని ప్రశాంత్ తనకారును ఇంటి ముందు పార్క్‌చేసి పడుకున్నాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో కారు పాక్షికంగా ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లు బెల్ట్‌షాపులో ప్రత్యక్షం

● సోషల్ మీడియాలో వైరల్ ● విచారణ జరిపిన సీడీపీవో

హుజూరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ఓ బెల్ట్‌షాపులో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై సీడీపీవో సుగుణ విచారణ జరిపారు. శుక్రవారం ఓబెల్ట్‌షాపులో అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనికి స్పందించిన సీడీపీవో సుగుణ వెంటనే కరీంనగర్ రోడ్‌లోని బెల్ట్‌షాపునకు వెళ్లి కోడిగుడ్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిర్వాహకుడు వెంకటేశ్వర్లును విచారించారు. రంగాపూర్‌లోని తన కూతుళ్లు ఇచ్చారని చెప్పడంతో వెంటనే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం సీడీపీవో సుగుణ విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వర్లుకు ఇద్దరు కూతుళ్లు రంగాపూర్ గ్రామంలో ఉంటున్నారన్నారు. వారికి చిన్నపిల్లలు ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రం నుంచి కోడిగుడ్లు ఇచ్చారన్నారు. వాటిని తండ్రి వెంకటేశ్వర్లుకు పంపించడంతో బెల్ట్‌షాపులో విక్రయించాడన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గుండెపోటుతో ఓ లారీడ్రైవర్ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్‌సింగ్ కొత్తగట్టు శివారులోని టోల్‌ప్లాజా సమీపంలో లారీని పార్కింగ్ చేశాడు. పక్కనేఉన్న హోటల్‌కు వెళ్లి టీతాగి వస్తుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు.

చర్చనీయాంశంగా మారిన కానిస్టేబుల్ బదిలీ

● మహిళా కానిస్టేబుల్‌తో ప్రేమాయణం
● నామమాత్రపు చర్యలపై విమర్శలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ తోటిమహిళా కానిస్టేబుల్‌తో ప్రేమలో పడ్డాడు. పెళ్లి సంగతి ఎత్తేసరికి మొహం చాటేశాడు. దీంతో ఆమె ఉన్నతాధికారులను ఫిర్యాదుచేసింది. అతనిపై బదిలీవేటు వేశారు. కరీంనగర్‌లోని ఒకపోలీసు ఠాణాలో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు అదేఠాణాలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ మధ్య ప్రేమ చిగురించింది. కొద్ది నెలల తరువాత వివాహం ప్రస్తావించేసరికి దూరంగా ఉండడం ప్రారంభించాడు. దీంతో మహిళా కానిస్టేబుల్ గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు మేల్ కానిస్టేబుల్‌ను మరో డివిజన్‌కు బదిలీచేశారు. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ఓ మహిళను మోసంచేసిన కానిస్టేబుల్‌పై బదిలీవేటువేసి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ కానిస్టేబుల్‌కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే మామూలు మహిళల పరిస్థితి ఏంటని సామాన్య ప్రజలు అనుకుంటున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.4.90 లక్షలు స్వాహా

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓవ్యక్తి రూ.4లక్షల90వేలు మోసపోయాడు. బాధితుడు శుక్రవారం కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కేసునమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన ఓ వ్యక్తికి ఆగస్టు 28న ట్రేడింగ్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు వస్తాయని టెలిగ్రాం లింక్, క్యూఆర్‌కోడ్ వచ్చింది. దీనిని నమ్మినబాధితుడు మొదట వెయ్యి రూపాయలు, ఆ తరువాత రూ.2వేలు, రూ.10వేలు ఇన్వెస్ట్ చేశాడు. ఇంకా రూ.50వేలు ఇన్వెస్ట్ చేస్తేనే మొత్తం డబ్బులు వస్తాయని చెప్పడంతో మరో 50వేల రూపాయలు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి ఫోన్‌పే ద్వారా బదిలీచేశాడు. మరోసారి లక్ష రూపాయలు, ఇలామొత్తం 4లక్షల 90వేల 720రూపాయలు పంపించాడు. ఆ తరువాత ఆ ఫోన్‌కు వాట్సప్ మెస్సేజ్‌లు చేసినా స్పందించలేదు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930 కాల్ చేశాడు. సైబర్ పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేశాడు.

కేజీబీవీలో అల్పాహారంలో పురుగులు

● ఆందోళనకు గురైన విద్యార్థినులు


ఉప్మాలో వచ్చిన పురుగు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 19: వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అందించిన అల్పాహారంలో శుక్రవారం పురుగులు రావడంతో విద్యార్థినులు ఆందోళనకు లోనయ్యారు. ఉదయం కేజీబీవీలో అల్పాహారంలో భాగంగా ఉప్మా వడ్డించారు. అందులో పురుగులు కనిపించడంతో విద్యార్థినులు అధ్యాపకులకు చెప్పేందుకు భయపడ్డారు. ఈ విషయంపై పాఠశాల ప్రత్యేక అధికారి శకుంతలను వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు. ఎంఈవో శ్రీనివాస్‌ను సంప్రదించగా ఉదయం తాను పాఠశాలను సందర్శించానని పేర్కొన్నారు. ఉప్మాలో పురుగులు రావడంపై విద్యార్థినులను ప్రశ్నించడంతో ముగ్గురు విద్యార్థినులు తమకు వచ్చాయని తెలిపారన్నారు. విద్యార్థినులు ఎవరూ అస్వస్థతకు గురికాలేదని, విచారణ జరుపుతున్నామని ఎంఈవో శ్రీనివాస్ వివరించారు.

ఆలయాల్లో వరుస చోరీలు

ధర్మారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట మల్లికార్జున స్వామి ఆలయ తాళాలు పగలగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం అర్చకులు రాగా గుడి తాళాలు పగుల కొట్టడం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కానిస్టేబుల్ రాజు సందర్శించి వివరాలు సేకరించారు. ఎత్తుకెళ్లిన హుండీని దొంగలు సమీపంలోని పంట చేలలో పగులగొట్టి నగదు దొచుకెల్లి హుండీని అక్కడే వదిలేశారు. ఈనెల 7న ఇదే గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ హుండి ని పగలగొట్టి నగదు దోచుకెళ్ళిన విషయం విధితమే. పదిరోజుల వ్యవధిలో నాలుగు ఆలయాల్లో దొంగలు హుండీలను పగల గొట్టడం, నగదు దోచుకెళ్లడం, చర్చనీయాంశంగా మారింది.

రోడ్డుకు రెండు వైపులా బుంగలు

● నిలిచిపోయిన చెంజర్ల-గంగిపల్లి ఆర్టీసీ బస్సు..


చెంజర్ల-గంగిపల్లి రోడ్డుకు ఇరువైపులా బుంగతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మానకొండూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంజర్ల నుంచి గంగిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు ఉన్న ప్రదేశంలో రెండు వైపులా బుంగలు పడ్డాయి. దీంతో శుక్రవారం కరీంనగర్ నుంచి ఆర్కండ్లకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా అవాక్కై బస్సును నిలిపివేశాడు. రెండు గుంతలు ఉండడం వల్ల బస్సు వెళ్లలేదని డ్రైవర్ ప్రయాణికులకు చెప్పాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు చేసేది ఏమిలేక కిందికి దిగి ఆ రెండు గుంతలలో బండరాళ్లను వేశారు. అనంతరం బస్సు ముందుకు నడిచింది. దీంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదం అంచున ప్రయాణం' చెంజర్ల-గంగిపల్లి ప్రధాన రహదారిపై బుంగ పట్టించుకోని అధికారులు అనే శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. అయినా ఇప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుపై పడ్డ రెండు బుంగలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

● ఎస్పీకి ఫిర్యాదు


రాజయ్య(ఫైల్)


పోలీసులతో వాగ్వాదానికి దిగిన కుటుంబీకులు, స్థానికులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులోని పేకాటస్థావరంపై ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈనెల18న దాడిచేయడంతో తప్పించుకునే క్రమంలో అదేగ్రామానికి చెందిన చాకలి రాజయ్య(45) కిందపడి మృతి చెందిన విషయం విధితమే. ఆయన మృతికి కారణం పోలీసులేనంటూ బాధిత కుటుంబీకులు, స్థానికులు ఘటనస్థలం వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు సిద్ధమైతే అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ మోతీరాం, పోలీసులు చేరుకున్నారు. నిరసనకారులను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. పలువురు గ్రామపెద్దలు సర్ది చెప్పడంతో అతి కష్టం మీద రాజయ్య మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయడంతో తప్పించుకునేందుకు యత్నించిన రాజయ్యను పోలీసులు వెంబడించారని భార్య రేణవ్వ తెలిపింది. ఈ క్రమంలో తన భర్త వ్యవసాయ పొలాల్లోంచి పరుగులు తీసి ఊపిరి అందక మృతిచెందాడని పేర్కొంది. తన భర్త రాజయ్య మృతికి కారణమైన స్థానిక ఎస్ఐతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మృతి రేణవ్వ జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితేకు శనివారం ఫిర్యాదు చేసింది. విచారణ జరిపి న్యాయం చేసేలా చూస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో శాంతించారు. పేకాట ఆడేందుకు వెళ్లిన వారు పరిహారం చెల్లించేలా ఒప్పందం కుదర్చడంతో శాంతించారు. రాజయ్య అంత్యక్రియలు పూర్తయ్యేవరకు పోలీసులు బందోబస్తు చేపట్టారు.

దసరా పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- జేబీఎస్ - కరీంనగర్ మధ్య 1,321 బస్సులు
- టీజీ ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకునేందుకు అవకాశం



భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నది. ప్రయాణికుల సౌకర్యార్థం జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 1,321 బస్సులు, కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 1,330 బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, అక్టోబరు 2 నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 20వ తేదీన 180 బస్సులు, 21న 110, 22న 50, 23న 50, 24న 50, 25న 50, 26న 78, 27న 203, 28న 190, 29న 170, 30న 90, అక్టోబరు 1న 100, అదేవిధంగా కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు అక్టోబరు 2వ తేదీన 30 బస్సులు, 3న 80, 4న 80, 5న 200, 6న 210, 7న 100, 8న 80, 9న 80, 10న 50, 11న 40, 12న 200, 133న 180 బస్సులు నడిపించనున్నట్లు వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, టికెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు.



వరద ప్రవాహంలో వాగుదాటుతున్న ప్రజలు



ప్రమాదపుటంచున ప్రయాణం..

గంభీరావు పేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద ప్రయాణికులు ప్రమాదపు అంచున ప్రయాణం చేస్తున్నారు. వర్షాలు ఎప్పుడు పడుతున్నాయో ఎప్పుడూ నిలుస్తున్నాయో తెలియని పరిస్థితి ఉండగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఎగువ మానేరు మత్తడి పెరుగుతూ తగ్గుతోంది. కామారెడ్డి-సిద్దిపేటకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు భయం భయంగా వాగు దాటుతున్నారు. ఒక్కోసారి వాగు దాటే క్రమంలో వరద పెరిగితే ఏమిటి పరిస్థితి అనే భయం ప్రజల్లో నెలకొంది. కొందరు ప్రజలు కాలినడకన తప్పని పరిస్థితిలో మానేరు వాగు దాటుతూ వెళుతున్నారు. - గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ డిపో మేనేజర్లతో ఆర్ఎం సమీక్ష

భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత నెల డిపోల పనితీరు, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గత నెల డిపోల ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, పి.మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.నాగభూషణం, ఎస్.వెంకన్న, రవీంద్రనాథ్, ఎం.శ్రీనివాస్, వి.శ్రవణ్ కుమార్, కె.కల్పన, మనోహర్, దేవరాజు, ప్రకాశరావు, బి.శ్రీనివాస్, ఆర్.హిమబిందు, జ్యోత్స్న పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

12 గేట్ల ద్వారా.. 35,293 క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద తగ్గింది. శుక్రవారం 12 గేట్లు ఎత్తి 35,293 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,16,138 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 77.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు శుక్రవారం 9,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4700 మానేరు, ములవాగు ద్వారా 4800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కులు, ప్యాకేజి 10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, ప్యాకేజీ 9 లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.171 టీఎంసీల నీరు ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలోకి క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో అధికారులు శుక్రవారం రాత్రి 7.30గంటలకు రెండు గేట్లను మూసి 6గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల కొనసాగిస్తున్నారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.689 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 16,309 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో ఉంది.

అందంగా.. ఆకర్షణీయంగా

- కొత్త సొబగులతో చీరల ఉత్పత్తి
- బతుకమ్మ సంబరాల్లో మురిసే విధంగా పంపిణీకి ఏర్పాట్లు
- సిరిసిల్లలో లక్ష్యం దిశగా స్వశక్తి చీరల ఉత్పత్తి





గోదాములకు చేరుస్తున్న చీరలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్వశక్తి మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేసే చీరలు అందంగా ఆకర్షణీయంగా తయారవుతున్నాయి. బతుకమ్మ సంబరాల్లో మహిళలు సిరిసిల్ల నేతన్నలు నేసిన చీరను అందుకోనున్నారు. ప్రభుత్వం అందించిన చీరల ఆర్డర్ల లక్ష్యం దిశగా ఉత్పత్తి జరుగుతోంది. ఈ నెల 30లోగా ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉండడంతో నేతన్నలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బతుకమ్మ కానుకగా తెలంగాణ సర్కార్ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు ప్రతి సంవత్సరం రెండు చీరలు అందించే విధంగా నిర్ణయించారు.

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతినిండా ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. నాణ్యతలో ఎలాంటి తేడా రాకుండా చర్యలు తీసుకున్నారు. స్వశక్తి మహిళకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా ఉత్పత్తి చేసిన చీరలను బతుకమ్మ పండుగకు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్పత్తి చేసిన బట్టను ప్రాసెసింగ్, ప్రింటింగ్ పూర్తిచేసి వివిధ జిల్లాలోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. మహిళలకు అదించే స్వశక్తి చీరను సిరిసిల్లలో గత నెలలో చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

సిరిసిల్ల నేతన్నకు చీరలతో భరోసా

నిత్యం ఒడిదుడుకుల మధ్య సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో అనేక కష్టాలు ఎదురీదుతున్న నేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్డర్లు భరోసాను కల్పిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా చీరలో ఉత్పత్తితో చేతినిండా పని కడుపునిండా వేతనంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు 2017 నుంచి 2023 వరకు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదని నిలుపివేసింది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు లేకపోవడంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది.

నేతన్నల ఆత్మహత్యలు, కార్మిక సంఘాల ఆందోళనలు, అనేక విషాధ సంఘటనల మధ్య ప్రభుత్వం మళ్లీ సిరిసిల్ల నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన చీరలను ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు పంపిణీ చేయడానికి నిర్ణయించింది. సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు పని కల్పించే దిశగా ఆర్డర్లను ఇవ్వడంతో కార్మికులకు నిరంతరంగా ఉపాధి కలుగుతుందని భరోసా వచ్చింది.



సిరిసిల్లలో స్వశక్తి చీరను చూపుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు (ఫైల్)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 4.30 కోట్ల మీటర్ల ఆర్డర్లు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అందిస్తున్న బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఊరట ఇస్తున్నాయి. ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు మొదటి విడతగా ఈ సంవత్సరం జనవరి, మార్చిలో 4.30 కోట్ల మీటర్ల చీర బట్ట ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్ల మరమగ్గాలపైన 1.30 కోట్ల చీరల ఉత్పత్తి జరిగే విదంగా చర్యలు చేపట్టడంతో కార్మికులకు మళ్లీ చేతినిండా పని లభిస్తోంది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో స్వశక్తి చీరలు ఉత్పత్తి మొదట్లో వేగంగా జరుగలేదు. తరువాత ఉత్పత్తి లక్ష్యం దిశగా వేగం పుజుకుంది. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం ఇతర రాష్ట్రాల నుండే కాకుండా తెలంగాణలోని వరంగల్, జగిత్యాల, నల్లగొండ, వికారాబాద్ లాంటి జిల్లాల నుంచి కూడా నేత కార్మికులు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందారు. బతుకమ్మ చీరలు ఉత్పత్తి ఆర్డర్లు రాకపోవడంతో కార్మికులు మహారాష్ట్రలోని బీవండి, షోలాపూర్, గుజరాత్‌లోని సూరత్ వంటి ప్రాంతాలకు వెళ్లారు. మరికొందరు ఇతర పనుల్లో స్థిరపడ్డారు. దీంతో స్వశక్తి చీరల ఉత్పత్తి ఇబ్బందికరంగా మారింది.

సిరిసిల్లలో దాదాపు 30 వేల వరకు మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో స్వశక్తి చీరల ఉత్పత్తి 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్)ల ద్వారా 9,600 మరమగ్గాల పైన ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటివరకు 4.30 కోట్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్‌లో 3 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది. ఆగస్టు 15న చీరలు అందించాలని లక్ష్యంగా ఉత్పత్తి అయిన బట్టను టెస్కో సేకరించడం ప్రారంభించినా ఉత్పత్తి పూర్తికాక పోవడంతో సెప్టెంబరు 30 వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 3 కోట్ల చీర బట్ట ఉత్పత్తి జరిగింది. అందులో 2.65 కోట్ల మీటర్లు సేకరించారు. మ్యాక్స్ సొసైటీల వద్ద 35 లక్షల మీటర్లు ఉంది.

దసరాకు రాజన్న ఆలయం ముస్తాబు

ఈవో ఆదేశాలతో ఏర్పాట్లు ముమ్మరం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా నవ రాత్రులను పురష్కరించుకుని రాజన్న ఆలయాన్ని అధికారులు ముస్తాబు చేస్తున్నారు. బతుకమ్మ, దసరా, దేవీనవరాత్రుల సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ధర్మగుండం శుద్ధి చేసి కొత్త నీటిని విడుదల చేశారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అలంకరించడం, స్వామి వారి బంగారం, వెండి తొడుగులను, వాహనాలను శుభ్రపరచడం వంటి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. రాజన్న ఆలయంలో ఏడు రోజులపాటు బతుకమ్మ ఆడేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తారని, బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.



స్వామి వారి తొడుగులను శుభ్రపరుస్తున్న సిబ్బంది

ధర్మపురి క్షేత్రంలో 22 నుంచి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, సెప్టెంబరు 19: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు దేవి శరన్నవరాత్రోత్సవాలు (దసరా నవరాత్రోత్సవాలు) జరుగుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం, అనుబంధ దేవాలయాల్లో కలశ స్థాపనలు జరుగుతాయని ఆయన వివరించారు. అక్టోబరు 2న దసరా రోజున జమ్మి ప్రదేశం వద్ద శమీ వృక్ష పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా నిత్యం అమ్మవారలు వివిధ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. మొదటి రోజున శైల పుత్రి, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంట రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. నాలుగో రోజు కూష్మాండ, శాకాంబరీ, ఐదవ రోజు స్కంధ మాత, ఆరో రోజు కాత్యాయని, ఏడో రోజు కాళరాత్రి, ఎనిమిదో రోజు మహాగౌరీ, తొమ్మిదో రోజు సిద్దిదాత్రి రూపంలో, పదో రోజు రాజరాజేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సెప్టెంబరు 29న మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజ, పుస్తక పూజలు, అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని ఈవో తెలిపారు.

బైక్‌కు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బైక్‌కు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసిన సంఘటన శుక్రవారం శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటు చేసుకుంది. కేశవపట్నం మోడల్ స్కూల్ బస్సు డ్రైవర్ శ్రీనివాస్ విద్యార్థులను ఎక్కించుకొని కేశవపట్నం నుంచి మొలంగూర్, ఆముదాలపల్లి, మెట్‌పల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొలంగూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బైక్ మీద వస్తున్న ముగ్గురు యువకులు బస్సు ఆపి డ్రైవర్ కాలర్ పట్టుకొని కిందికి దింపి నానా బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో వ్యక్తి గల్లంతు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి గల్లంతు అయినట్లు కోరుట్ల పోలీసులు తెలిపారు. గ్రామ శివారులోని ఇటుక బట్టీలో పని చేయడానికి రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూర్ జిల్లా కొండాపూర్ మండలం ఎర్లపల్లి గ్రామానికి చెందిన కందవరపు రమణయ్య (49) వచ్చినట్లు ఇటుక బట్టీల యజమాని ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రోజున పని ముగించుకొని కాల్వలో స్నానం చేయడానికి బట్టీలో పనిచేస్తున్న నలుగురితో కలిసి రమణయ్య వెళ్లాడు. స్థానం చేస్తున్న సమయంలో రమణయ్య కాలుజారి నీటి ప్రవాహంలో కొట్టుపోయాడు. ఇటుక బట్టీల యజమాని ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్య దృష్టి విద్యార్థులకు గుర్తింపు రావాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- అంధ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులు, నిర్వాహకులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్య దృష్టి ఉన్న విద్యార్థుల పాటలు దిగంతాలు చేరి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన దివ్య దృష్టి విద్యార్థులు అద్భుతంగా పాటలు పాడి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఫిలింభవన్‌లో ఫిల్మ్ సొసైటీ, సాహితీ గౌతమి ఆధ్వర్యంలో జరిగిన వీడియో ఆల్బమ్ ప్రదర్శన, విద్యార్థులకు జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభకు ఏదీ అడ్డు కాదని విద్యార్థులు నిరూపించారని, ఇది మన జిల్లాకు గర్వ కారణమని అన్నారు. విద్యార్థులు వారి ఆత్మను ఆవిష్కరిస్తూ హృదయంతో పాడారని అన్నారు. వీడియో నిర్వాహకుడు పొన్నం రవిచంద్ర, దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు సరళ, సంగీతాన్ని అందించిన కేపీ శర్మ, వీడియోగ్రఫీ చేసిన కె లక్ష్మీగౌతమ్, వేణు దాసరిని అభినందించారు. చిన్నారులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, శ్రీనిత, శైలజ, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణిరతన్, లోహిత్‌కు కలెక్టర్ నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు.



సీఎం మంజూరు చేసిన ఐదు లక్షల విలువ చేసే సంగీత పరికరాలను అందజేశారు. గ్రానైట్స్ ఫ్యాక్టరీ అసోసియేషన్ వారు ప్రతీ విద్యార్థికి అయిదు వేల చొప్పున నగదు, కపిసొ కోశాధికారి శ్రీనివాసాచారి హాట్ బాక్స్‌లు, జాయింట్ సెక్రెటరీ కొమురవెల్లి వేంకటేశం రగ్గులు, గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ వారు 80 మంది పిల్లలకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో కొత్త అనిల్‌కుమార్, అన్నవరం దేవేందర్, రామచంద్రారెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని గౌస్ ఆలం ఆదేశించారు. కమిషనరేట్‌లో శుక్రవారం అక్షర చిట్‌ఫండ్స్ కేసు, ఇటీవల వెలుగులోకి వచ్చిన క్రిప్టో కరెన్సీ కేసులతో సహా ఆర్థిక నేరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆర్థిక నేరాల్లో నిందితులకు శిక్ష పడేలా పనిచేయడంతోపాటు బాధితులకు సొమ్ములు ఇప్పించడం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. కొత్త చట్టాలకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని సూచించారు. సాక్ష్యాల సేకరణలో అలసత్వం లేకుండా వ్యవహరించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 18 కేసుల్లో నిందితులు ముగ్గురికి జీవితఖైదు, మిగతా వారికి ఏడాది నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష పడినట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌జి, వేణుగోపాల్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్, కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన దుబ్బాక రిశ్వంత్, కె తరుణ్ నెట్‌బాల్ పోటీల్లో తమ ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె వేణు శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మల్యాల మండలం నూకపల్లిలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా తరుపున ఆడిన ఇద్దరు విద్యార్థులు నెట్‌బాల్ ఆటల్లో తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ ఆటల్లో వి మోహన్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌స్పోర్ట్స్ ఇన్‌చార్జి బండ్ల బాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

ధర్మపురి: ధర్మపురి మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన జి అనుదీప్, కే రామ్‌తేజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న జగిత్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోనె రమేశ్, పీడీ, పీఈటీలు సంతోష్, కల్పన, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్, సిబ్బంది





హీరో శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి, మానేరు వేడుకల్లో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, కిమ్స్ డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు

విద్యా సంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి సందడి చేశారు.

● భగత్ నగర్ అల్ఫోర్స్‌లో..

నగరంలోని భగత్‌నగర్ అల్ఫోర్స్ పాఠశాలలో బతుకమ్మ కార్నివల్, పల్లకీ సేవ మహోత్సవం నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రెట్టింపు ఉత్సాహంతో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించుకోవడం గొప్ప అనుభూతి నిస్తోందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరి మీద ఉండాలని అన్నారు.

● వేడుకల్లో హీరో శ్రీకాంత్

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సినీ హీరో శ్రీకాంత్ సందడి చేశారు. మొదట అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి, హీరో శ్రీకాంత్ పాఠశాల ప్రాంగణంలోని దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేశారు. చిత్ర దర్శకులు నాగేశ్వర్‌రెడ్డి, నిర్మాతలు ఎం.చందు, ఎన్.వెంకట్, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి సతీమణి వనజ పాల్గొన్నారు.

● మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో

మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు.

● కిమ్స్ డిగ్రీ కళాశాలలో..

నగరంలోని కిమ్స్ డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ తొమ్మిదిరోజులపాటు సాగే రాష్ట్ర పండుగ అన్నారు. ప్రిన్సిపాల్‌లు బి.అర్జున్‌రావు, గౌతమ్ పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాటనీ విభాగం ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం, జాతీయ సేవా పథకం సహకారంతో బతుకమ్మ పండుగ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, బాటనీ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల వనరుల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయినులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అనంతరం టీఎల్ఎంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన సమత, శ్రీలతను సన్మానించారు. ఎంఈవో రామయ్య పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని విద్యోదయ విద్యాసంస్థల హాస్టల్ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ యేబూషి ఆర్యన్ కౌశిక్, అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి ఏబూషి మహాలక్ష్మి పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఉత్సవాలను సంస్థ అధినేత నరేందర్ రెడ్డి ప్రారంభించారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో..

భగత్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో జాతీయ సేవా పథకం, కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, ఆయన సతీమణి శారదుమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ పూలను పూజించే సంస్కృతి తెలంగాణలో ప్రత్యేకమన్నారు. కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ విశిష్టతను యావత్ ప్రపంచానికి చాటాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్‌లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.రజిత, జె.ఆంజనేయులు, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ దంపతులు

ఉచిత మందులను వినియోగించుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఎంసీహెచ్‌పీవో సనజవేరియా, హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రణవ్ పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాల నిర్మాణమే లక్ష్యం

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత గ్రామపంచాయతీల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో టీబీ రహిత గ్రామ పంచాయతీల పోస్టర్‌ను ఎంపీవో ప్రభాకర్, జిల్లాటీబీ కో-ఆర్డినేటర్ రాజబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరాకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల అధికారులతో పండగల ఏర్పాట్లపై ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మలు ఆడే ప్రదేశాల్లో దీపాలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై గుంతలను పూడ్చి వేయాలని సూచించారు. నిమజ్జనం రోజున బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహకారఅధికారి నర్సింహాచార్యులు, తహసీల్దార్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్ర శేఖర్, పంచాయతీ రాజ్ ఈఈ మంజుల భార్గవి, సీఐ సదన్ కుమార్, ఎస్సైలు శ్రీకాంత్ గౌడ్, స్వాతి, నరేందర్‌రెడ్డి, సౌమ్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

లక్ష్మీపూర్ జీపీ ఎదుట కాలనీవాసుల ధర్నా

రామడుగు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి, నేతకాని కాలనీలో సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని, రక్షిత మంచినీటి బావినీటిని నిలిపివేయాలని మండలంలోని లక్ష్మీపూర్ మహిళలు గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డుతో తమకు ఇబ్బందులు అవుతున్నాయని నినాదాలు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని కార్యదర్శిని నిలదీశారు. తహసీల్దార్ రాజేశ్వరికి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బండారి అంజలి, దుర్గం అనిత, జాడి రజిత, అంజలి, శంకరమ్మ, కనకలక్ష్మి, వనిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల్లో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్రీరాంనగర్, ఎస్‌యూ, కొత్తయాష్వాడ, సలంపురా, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొత్తపల్లి (హెచ్), ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మగ్దుం పూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

జీవో విడుదలపై సంబరాలు

గన్నేరువరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానేరునదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.77కోట్ల నిధుల మంజూరు జీవో విడుదలపై మానేరు బ్రిడ్జి సాధనసమితి అధ్యక్షుడు జగన్మోహన్ అధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలను నిర్వహించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు గడ్కరీ, బండి సంజయ్, ఎమ్మెల్యే బ్ల సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాము, జీల కుమార్ యాదవ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చల్ల హరిశంకర్‌కు ఘన సన్మానం



సన్మానిస్తున్న మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్‌ను మంక మ్మతోట, రాంనగర్ మున్నూరుకాపు సంఘం ప్రతి నిధులు, స్థానికులు ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల అమెరికాలో నిర్వహించిన గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ ఆత్మీయ మహాసభలో పాల్గొని శుక్రవారం కరీం నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాంచారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి వేదాంతం సత్యనారాయణ, కోశాధికారి సత్యనారాయణ, బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు చేతి చంద్రశేఖర్, మెరుగు శ్రీనివాస్, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, జెల్లోజి శ్రీనివాస్, వొడ్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీకి మరమ్మతు చేపట్టాలి



కాలువను పరిశీలిస్తున్న మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల కురిసిన వర్షాలకు 53వ డివిజన్ పరిధిలోని కాశ్మీరుగడ్డలో మురుగునీటి కాలువపై వేసిన స్లాబ్‌తోపాటు డ్రైనేజీ కూలి పోవడంతో ప్రమాదకరంగా ఉందని, వెంటనే మరమ్మతు చేయాలని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు అన్నారు. 53వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చంద్రమౌళితో పాటు స్థానికులు డ్రైనేజీని పరిశీలించి, బాగుచేయించాలని కోరడంతో శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 24 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ నుంచి దాదాపు సగం నగరంలోని వరద నీరు కలెక్టరేట్ మీదుగా వెళ్తుందని, కాలువ కూలిపోవడంతో ప్రమాదాలు జరుగకుండా మరమ్మతు చేయాలని కోరారు. నగరంలోని చాలా చోట్ల దెబ్బతిన్న పాత డ్రైనేజీలకు మరమ్మతు చేయించాలన్నారు. లేనట్లయితే ప్రమాదాలకు మున్సిపల్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: వరంగల్‌లో నిర్వహించిన బీసీల రాజకీయ మేధో మదన సమావేశానికి సంఘం నాయకులు తరలివెళ్లారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని శివాలయం (బొమ్మలగుడి)లో అన్నపూర్ణ సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన మాంటిస్సోరి హౌస్ ఆఫ్ చిల్డ్రన్ పాఠశాల విద్యార్థులకు విశ్వహిందూ పరిషత్ గో రక్షా టోలీ సభ్యుడు వుట్కూరి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎల్ఎండీ కాలనీలోని గిరిజా గోశాలలో గోవులపై అవగాహన కల్పించారు.

సుభాష్‌నగర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుమారుడు పొన్నం అనూప్ జన్మదినం సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో అన్నదానం చేపట్టారు. పొన్నం అనూప్ మిత్రం బృందం, స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

-రాజరాజేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు నంది మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో అన్నదానం చేపట్టారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, ఎ.సంజీవ రెడ్డి, మునిందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని నాయినిచెరువు వద్ద స్వచ్ఛతహి సేవాలో భాగంగా శుక్రవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది చెత్త తొలగించారు.

వీణవంక: జిల్లాపరిషత్ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహించిన బాదం సురేష్ పదోన్నతి పొందగా తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.

మహమ్మద్ ప్రవక్త సూక్తులు అనుసరణీయం



ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జీవితం భవిష్యత్ తరాలకు అందాలని జమాతే ఇస్లామీ హింద్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని, ఆయన సూక్తులు మానవాళి అనుసరణీయమని సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వరకు నిర్వహించే ఎక్స్ పో-2025ను శుక్రవారం ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్‌తో కలసి ప్రారంభించారు. అధ్యక్షుడు షోహబ్ అహ్మద్‌ఖాన్, మహ మ్మద్ ఖైరొద్దీన్, ఉమేర్ అహ్మద్‌ఖాన్, ఇస్‌హాక్, నయూమ్, తన్వీర్ అహ్మద్‌ఖాన్, సయ్యద్ మొయిన్ అహ్మద్, సయ్యద్ జుబేర్ అహ్మద్, ముస్తాక్‌అలీ, ఫసియొద్దీన్ నవాబ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ బాక్సింగ్, తైక్వాండో, తాంతా క్రీడాల్లో సత్తాచాటినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. జగిత్యాల జిల్లాలో బాక్సింగ్ అండర్-19 విభాగంలో ఐదుగురు అబ్బాయిలు, తైక్వాండో క్రీడాల్లో ఆరుగురు అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు గోల్డ్‌మెడల్స్, ఎనిమంది అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సిల్వర్‌మెడల్స్ సాధించినట్లు తెలిపారు. తాంతా క్రీడలో ఇద్దరు అబ్బాయిలు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. త్రోబాల్ జూనియర్స్ విభాగంలో గజ్జెల రాంచరణ్ జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలల డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్‌లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

● అవీఇవీ..

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు.

చొప్పదండి: మండలంలోని రేవెల్లికి చెందిన ముచ్చెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదిశ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.25వేల ట్రాక్ సూట్స్, షూస్‌ను అందజేశారు.

సుభాష్‌నగర్: భరోసాస్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో శుక్రవారం స్థానిక అంధుల పాఠశాల విద్యార్థులకు బ్లూటూత్ స్పీకర్లను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, శివజ్యోతి, అభిరామ్, విశ్రుత్‌రామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ఎస్సారార్ కళాశాలలో శుక్రవారం పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న జయంతి నిర్వహించారు.

గంగాధర: గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లను కార్యదర్శులు వేగవంతం చేయాలని ఎంపీవో గౌరి రమేష్ అన్నారు. శుక్రవారం గ్రామాల్లో పర్యటించారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు.

- మండలంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరామర్శించారు.

సంఘం అభివృద్ధే లక్ష్యం

సైదాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహ కార సంఘం అభివృద్ధి, రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పాకవర్గం పని చేస్తున్నదని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో వెన్కేపల్లి ఎల్ఎస్ సీఎస్ 65వ అర్ధవార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న సంఘాన్ని లాభాల్లోకి తెచ్చామన్నారు. సీఈవో శ్రీధర్, డైరెక్టర్లు మునిపాల రవి, బొమ్మగాని రాజు, నమిండ్ల జమున, పల్లేని ప్రవీణ్‌రావు, ఏలూరి తిరుపతిరెడ్డి, ఏలూరి నర్సిరెడ్డి, చాడ ప్రకాష్, గుగులోతు లక్ష్మి, ఓలాద్రి మహిపాల్‌రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి

సాగుకు లేదు బెంగ..

(5వ పేజీ తరువాయి)

నిల్వ సామర్థ్యం కలిగిఉండగా ఇంకా భారీగా వరద ప్రవాహం వస్తుండడంతో 18 టీఎంసీల నీటినిప్రాజెక్టులో ఉంచి వచ్చిన వరదనంతా కిందికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో సెప్టెంబరు 19సాయంత్రానికి 78టీఎంసీల నీరు నిలువ ఉండగా దిగువకు గేట్లద్వారా 51,560క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నారు. ఎల్ఎండీ నీటి నిలువ సామర్థ్యం 24.032 టీఎంసీలు కాగా 23.732 టీఎంసీలను నిలువ చేసుకొని 20,309 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మిడ్ మానేరు డ్యామ్‌కు 9,500 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా ప్యాకేజీ 9,10కి 3,700, దిగువకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నారు.

మున్నూరుకాపు మండల యూత్ అధ్యక్షుడిగా అనిల్

గన్నేరువరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల మున్నూరుకాపు యూత్ అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన కొలుపుల అనిల్ నియామకమయ్యారు. మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు గంప మహేష్ శుక్రవారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ అధికారప్రతినిధి డాక్టర్‌కొనగాల మహేష్ ఆధ్వర్యంలో తననివాసంలో అనిల్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్‌పార్టీ అధికారప్రతినిధి కొనగాల మహేష్‌కు, జిల్లా అధ్యక్షుడు గంప మహేష్‌కు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

స్కేటింగ్‌లో 'బిర్లా' విద్యార్థులకు పతకాలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) నగర శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌కుచెందిన విద్యార్థులు శ్రీహన్సీ, శ్రీఆన్, మైర గౌరిశెట్టి, కృతికృష్ణ, వియాన్‌రెడ్డి, జైన్, విదాత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాస్థాయి స్కేటింగ్‌లో పతకాలు సాధించినట్లు కోచ్‌లు సాయిరమణ, కావేరి తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని వ్యాయామవిభాగం అధిపతి సుంకరి మురళీధర్ తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితావిశ్వనాథన్ శుక్రవారం విద్యార్థులను అభినందించారు.

నూతన విద్యావిధానానికి భిన్నంగా ఉండాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవిద్యాపాలసీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయవిద్యా విధానం -2020కి భిన్నంగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఒకప్రకటనలో అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఈపీ ద్వారా ప్రభుత్వవిద్య నిర్వీర్యం అయ్యేపరిస్థితులు ఉన్నాయని తెలిపారు. జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా రాష్ట్రవిద్యాపాలసీ ఉండాలని పేర్కొన్నారు.

చెస్, యోగా పోటీల్లో పలువురికి పతకాలు

భగత్‌నగర్,సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ఈ-టెక్నో స్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 19చెస్, యోగా పోటీలో పలువురు పతకాలు సాధించినట్లు ఆర్గనైజింగ్‌సెక్రెటరీ జి.మధు జాన్సన్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అల్ఫోర్స్‌విద్యాసంస్థల చైర్మన్‌డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మెడల్స్ అందజేశారు. పీడీలు, కోచ్‌లు, సరిత, బిరాజశేఖర్, రామకృష్ణ, ఆనంద్ కిషోర్, ప్రియాంక, ప్రవళిక, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేని బిల్లింగ్ కోసం ఆటోమేటిక్ మీటర్ రీడింగ్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లోపాలు లేని బిల్లింగ్ విధానం కోసం విద్యుత్‌వినియోగదారులకు ఆటోమేటిక్ మీటర్‌రీడింగ్(ఏఎంఆర్) వ్యవస్థను రూపొందించామని కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌వినియోగదారులకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు తలెత్తకుండా ఈవిధానం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పిల్లల చదువులకు (2025-26 విద్యాసంవత్సరానికి) కేంద్రప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలకు కొత్తపల్లిపరిధిలోని కార్మికులు ఈనెల30లోగా దరఖాస్తు చేసుకోవాలని బీడీ కార్మికసంక్షేమ సీనియర్ మెడికల్‌ఆఫీసర్ డాక్టర్‌అనూషరాణి ప్రకటనలో తెలిపారు. ఐటీఐ,ఇంటర్,డిగ్రీ,ప్రొఫెషనల్‌కోర్సులు చదివేవారు అక్టోబరు31లోగా ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని,వివరాలకు040-29561297లో సంప్రదించాలన్నారు.

జాతీయ ఎన్జీవో శాంతి పురస్కారం అందుకున్న కృపాదానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సీనియర్ కళాకారుడు, ఫోక్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు గుండ్ర కృపాదానం 2025 జాతీయ ఎన్జీవో శాంతి పురస్కారం అందుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ, ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వాహకుడు డాక్టర్ రమేశ్, నటి రాగిణి, ట్రాఫిక్ డీసీపీ నాయక్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర ఉపకార్యదర్శి రమణయ్య, గుండేటి రాజు, లక్ష్మారెడ్డి, నరేశ్, చందన్‌రాజ్, సాల్మన్‌రాజు అభినందనలు తెలిపారు.

తెలంగాణ కవులపై వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ (ఎస్ఎల్‌టీఏ-టీఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ కవులపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు చలిగంటి సంజీవయ్య, స్తంభంకాడి గంగాధర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు పోతన, దాశరథి, సుద్దాల హనుమంతు,వంటి కవులలో ఒకరిపై వ్యాసంరాసి అక్టోబరు 6వ తేదీలోగా జిల్లాస్థాయి పోటీలకు పంపాలని తెలిపారు. ఐదు అత్యుత్తమ వ్యాసాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన విద్యార్థులకు లక్ష రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తివివరాలకు 7386200610 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువతిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మానేరు జలాశయం వద్ద ఆత్మహత్యకు యత్నించిన యువతిని శుక్రవారం కరీంనగర్ లేక్ పోలీసులు కాపాడారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన ఓ యువతి(23) కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడానికి కరీంనగర్‌లోని మానేరు జలాశయం వద్దకు వచ్చింది. గమనించిన లేక్ ఔట్‌పోస్ట్ హోంగార్డు శ్రీనివాస్ అప్రమత్తమై అక్కడి నుంచి ఆమెను బయటకు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం ఆమె తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా హోంగార్డుశ్రీనివాస్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

తెలియని లింక్ ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దు

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ ఫోన్‌లకు, సోషల్ మీడియా ద్వారా వచ్చే తెలియని లింక్స్ తెరిచి డబ్బులు పోగొట్టుకోవద్దని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సుభాష్‌నగర్ వద్ద యువకులకు, ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అవగాహన కల్పించారు.

ఉచిత పశువైద్య శిబిరం

చిగురుమామిడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సుందరగిరిలో ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. పశుసం వర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లింగారెడ్డి, ఏడీడాక్టర్ వినోద్‌కుమార్, స్థానిక పశువైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ జంగా రమణారెడ్డి, సంస్థ అధ్యక్షుడు పిట్టల తిరుపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

27న చదరంగం పోటీలు

హుజూరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల27న బాలికలు, మహిళలకోసం ప్రత్యేకంగా చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఆవిష్కరించారు. ఆసక్తిగలవారు ఈ నెల26 లోపు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మంకమ్మతోటలోని 45వ డివిజన్‌లో పారిశుధ్య విభాగానికి చెందిన కార్మికుల కొరతతో డివిజన్ ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కార్మికులను భర్తీ చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

సమస్యలపై స్పందించని అధికారులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): దుర్శేడ్‌లోని సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని, స్పందించేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గుంతలు పడిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని, బతుకమ్మ ఆడుకునే ప్రాంతంలో చిత్తడి తొలగించాలని కోరారు.